# తారతమ్యం

సూర్యం ఇలా చెప్పాడు:

"నేను నా అక్షరాభ్యాసం అయిన రోజుకి ఐదేళ్ళ ఐదు నెలల ఐదు రోజులవాణ్ణి. పరయ్య మేష్టారిచెయ్యి మంచిదని మానాన్న ఆయనను పట్టణానికి రప్పించాడు. ఆయన నాచేత ఓనమాల వరకు దిద్దించాడు. "నాదగ్గర చదువుకున్న వాళ్ళు తాలూకా తహశీల్దారు లయారు. నువ్వు జిల్లాకలెక్టరవాలి. తెలిసిందా పంతులూ!" అని పరయ్య మేష్టారు నాతో అనటం నాకు బాగా గుర్తు.

మానాన్న అప్పటికీ ఇప్పటికీ తాలూకా గుమాస్తాగా పనిచేస్తూనే ఉన్నాడు. వినా వంశప్రతిష్ఠని నిలబెట్టాలనే దీక్షతో మా నాన్న - పరయ్య మేష్టారికి రానూ పోనూ ఖర్చులక్రింద రుపాయవలా, తాంబూలంలో వరహాతోబాటు పరికొత్త పంచెల చాపు పళ్ళెంమధ్య పడతపెట్టి నాచేత ఇప్పించాడు. ఆయన ఆనందం అప్పటికి నా ఆనందంలాగే ఉండింది. అల్పసంతోషులు బాలురు. అదేవిధంగా పరయ్య మేష్టారు సంతృప్తిని ముఖంలో, కళ్ళతో ప్రకటించి నన్ను, జిల్లాకలెక్టరు అవమని మరోకసారి దీవించారు.

నన్ను బడికి పంపించారు. అరుగుమీద ఉన్నది ఆ ఆఖ తరగతి ఆ బడిలో. వీధిని పోయే బండ్లని, సైకిళ్ళని, మిఠాయిబండ్లనీ చూస్తూ మేం అఆలు దిద్దేవాళ్ళం. పలక అరిగినా కాని పదం పలికేదికాదు. మేష్టారు చుముడిలా కొట్టేవాడు. సాయంకాలం అయేసరికి మా అమ్మమ్మ వాతలకి ఏదో వైద్యం చేసేది.

"రోజూ పసిపిల్లవాణ్ణి మేష్టారు కొడుతున్నాడండి. కాస్త మన పిల్లాణ్ణి కొట్టొద్దని చెప్పిరండి" అని మా అమ్మ నాన్నతో చెపుతూండేది.

"మేష్టారికి పిల్లలమీద ముద్దుంటే మొద్దులౌతారు. తన మన తారతమ్యం ఉండకూడదు బడిపంతుళ్ళకి. దెబ్బలు తగులుతూంటేగాని దృష్టి పలకమీద ఉండదు. నీ పిల్లాడేం కరిగిపోడులే" అంటూండేవాడట మానాన్న.

నాకు అరుగుబడి ఎప్పుడు విరగడౌతుందా అని అనిపిస్తూండేది. వీపుమీద పడినచోటే కొత్తిదెబ్బ పడుతుండటంవల్ల వీపు మొద్దుబారింది. దెబ్బల విలువ తగ్గింది. మేష్టారు కొట్టడానికి చెయ్యెత్తితే కొత్తల్లో ముందుగానే గొంతెత్తేవాళ్ళం. ఇప్పుడు, అంతా కూడబలుక్కున్నట్టు, పంతులు దెబ్బకి పలుకూ ఉలుకూ వినబడకుండా చేశాము.

గుణింతాలు వచ్చాక మేం ఒకటో క్లాసులోకి వచ్చామనిపించింది. కాని, పంతులు మారలేదు. దెబ్బలు మాయలేదు.

"చదువుకున్నవాడి వంటిమీద వెన్న కరుగుతుందిరా నాయనా! చదువంటే అంత వేడి. అందుకే వారం వారం తలంటి పోసుకోవాలి" అంటూండేది మాఅమ్మమ్మ.

"చదువు వేడి కాదే అమ్మమ్మా! దెబ్బల వేడియే వెన్న కరిగిస్తుంది" అనేవాణ్ణి నేను.

## "చక్రవర్తి"

ఏడాది గడిచింది. ఎక్కాలు చదవడం ప్రారంభమైంది. ఎక్కాలు గుక్క త్రిప్పకుండా వప్ప చెప్పేవరకూ పంతులు వదిలేవాడు కాదు.

ఆ ఏడు నాకు బాగా జ్ఞాపకం. మానాన్నకి అమలాపురం బదిలీ అయింది. అయిష్టంతోనే నాన్న ఆ ఊరికి వెళ్ళాడు కాని, మమ్మల్ని నాలుగు నెలలపాటు మాఊళ్ళోనే ఉంచేశాడు.

నాన్న లేని కారణంగా నాలో అల్లరి ఎక్కువైంది. మాకు మా మేనమామ గార్డియన్. ఆయన ఉదయమే ఇంటివద్దసంధ్య వార్చుకుని కాఫీ త్రాగి మా వీధికి వచ్చి మమల్ని చూసి కప్పు కాఫీ త్రాగి మరీ వెడుతుండేవాడు.

మా మామయ్య నాకు చాల భీకరంగా కనుపించేవాడు. ఆదృష్టివల్లే నాలో మార్పు వచ్చింది. బడికి వెళ్ళినా, ఇంటికి వచ్చినా కాని అటుపంతులు, ఇటు మామయ్య కింకరుల్లా కనుపించేసరికి నాకు అల్లరిఎక్కువైంది. సాయంకాలం మామ రాడు, పంతులూ ఉండడు. నాన్న ఊళ్ళోనే లేడు. అందుచేత పంజరంలోని పక్షికి స్వేచ్ఛ వచ్చేది. చెల్లెలు, అక్కా కొనుక్కున్న బొమ్మల్ని, అల్లుకున్న ఊలు పటాల్ని ధ్వంసం చేసేవాణ్ణి. నా కిప్పటికీ జ్ఞాపకం; మా అక్కయ్య నాపై కోపంతో "వాడో భస్మాసురుడు" అని పళ్ళు బిగించి అంటూ ఉండడం.

తెల్లవారగానే మామయ్య వచ్చి మా ఇంట్లో రెండోసారిగా కాఫీ ఆరగిస్తుండగా అక్కాచెల్లెళ్లు ఐక్యకంఠంతో ఈ భస్మాసురునిపై అభాండాలు చెప్పేవారు. మొదట్లో మామయ్య నాపై హుంకరించాడు. అదేం పనిచేయలేదు. రెండోరోజు వీపుమీద ఒక దెబ్బ వేశాడు. అదీ పాత దెబ్బల్లో, సముద్రంలో ఉద్ధరిణెడు మంచి నీళ్లు కలిసినట్లుగా కలిసిపోయింది. మూడోరోజు మేష్టారితో మంతనాలు సాగించాడు మామయ్య. ఆరోజు సాయంకాలం మామయ్య, అలవాటు తప్పించి మాయింటికి వచ్చాడు.

నేను డాబామీదకు వంగిన సీతాఫలం చెట్టుకొమ్మను లాగి పండ్లకు బుట్టలు కడుతుండగా మామయ్య "ఒరేయ్ సూరిగా!" అని అరిచాడు. మా ఇల్లంతా అతని స్వరం ప్రతిధ్వనించింది.

క్రిందకు దిగి వచ్చాను. మామయ్య నిటారుగా నిలుచున్నాడు. అతని కాలుదగ్గర కర్రబండ, చేతిలో గొలుసూ ఉన్నాయి. ఇప్పుడు అతని ఆకృతిని తలచుకుంటే ఇన్‌స్పెక్టర్ జావెర్ట్‌లా నా కంటికి అతను కనబడతాడు. మధ్యయుగం అనాగరికతకి అతనొక చిహ్నంలా కనుపిస్తాడు.

నన్ను గట్టిగా పట్టుకుని చేతికి గొలుసు కట్టి గుదిబండ తగిలించాడు. ఆనాడు శనివారం కావటంవల్ల ఇంత కఠినశిక్ష నాకు పడింది. ఆరాత్రి ఆగ్రహంవల్ల అన్నం తినలేదు.

ఆదివారం నేను వసారాలో కూర్చున్నాను - బండమీద. పొద్దున్నే మా అమ్మ కాఫీ తెచ్చింది.

"రాత్రి అన్నం కూడా తినలేదు. కాఫీయేనా త్రాగరా నాయనా!" అంది అమ్మ.

"నేను తాగనే... వెధవ కాఫీ... నాకొద్దు" అంటూ కాఫీని ఒలకపోశాను.

"అదేంరా వెర్రి తండ్రీ! కొంచెం ఓవల్టీను తాగుతావా?"

"తాగనే... తాగనంటే తాగను"

"నా తండ్రివి కదూ!" అంటూ అమ్మ నన్ను బుజ్జగిస్తూ ఇటూఅటూ చూసి ఎవరూ లేరని గ్రహించి నా చేతిలో పావలా కాసు పెట్టి రహస్యంగా 'దాచుకో. రేపే మన్నా కొనుక్కు తిను. లేకపోతే జైస్లోపు చూడు" అంది.

"నా కొద్దే నీ వెధవ పావలా!"

"అరవకురా...ఏం కావాలో చెప్పు."

"రూపాయి కావాలే.....కొాన్స్వాస్ కోళ్ళు కొనుక్కుంటా" అన్నాను.

"సరే...ఇస్తాలే...కాఫీ తాగుతావా?"

"ఊఁ."

ఆ ఆదివారాన్ని మాత్రం నేను నాజీవితంలో మరువలేను. ఉదయమే మామయ్యవచ్చి రెండోసారి కాఫీ ఆరగిస్తూ నన్ను పరామర్శించి వెళ్ళాడు.

"బుల్ డాగ్ లా పెట్టావేంరా ముఖం" అన్నాడు నవ్వుతూ మామయ్య.

"అదేమిట్రా అన్నయ్యా, అల్లుడికి బండ శిక్షే కాకుండా పేర్లు పెడుతున్నావేంరా" అన్నది మా అమ్మ.

ఆమె అన్నమాటలకు మామయ్య జవాబు చెప్పలేదు. నన్నోసారి పరిశీలించి వెళ్ళిపోయాడు.

రూపాయి బిళ్ళ జేబులో పడింది. అమ్మ అన్నం తినిపించింది. కడుపునిండా తిన్నాను. చెల్లి, అక్కయ్యా అన్నాలు తిని వసారాలో నాకు ఎదురుగా కూచున్నారు. అక్కయ్య ఊలుతో బొమ్మలు అల్లుతోంది. చెల్లి కొత్త ఆట బొమ్మని అలంకరిస్తూంది.

అక్కయ్య అల్లుతున్న బొమ్మని చెల్లెలు విమర్శగా చూసి చూసి నా వైపు చూసి నవ్వింది.

"ఎందుకే నవ్వుతావు భడవా" అని కసిరాను.

"నీబొమ్మే అల్లుతోంది రా అక్క" అంది నవ్వుతూ చెల్లి.

"అకోతిబొమ్మ కాదే ఇది కృష్ణుడిబొమ్మ. రోలుకి కట్టింది కృష్ణుణ్ణి వాళ్ళమ్మ, ఈడ్చుకుంటూ తాటిచెట్లవద్దకు వచ్చాట్ట కృష్ణుడు. ఆ బొమ్మ" ఇది అన్నది అక్కయ్య.

"ఐతే అన్నయ్య కూడా కృష్ణుడేనే" అంది చెల్లి.

"ఛా, ఫో, నోర్మూయ్" అన్నాను నేను.

"ఎందుకురా దానిని అలా కసురుతావ్?" అంది అక్క.

"నేను దగ్గిరికి రాలేనని ఏవో కూతలు కూస్తోందిచూడు...రేపు నీబొమ్మని పీకిపీకి పారెయ్యకపోతే చూడు" అన్నాను.

"నీకుదిబండ ఊడితేకదా!" అంది అక్కయ్య.

"బళ్ళో కెలా వెడతాడే అన్నయ్య?"



"బుల్ డాగ్ లా పెట్టేవేం రా ముఖం"

"వీపుమీద బండపెట్టుకుని పోతాడే" అంది అక్కయ్య నవ్వుతూ.

"నవ్వకండి, మీకుకూడా బండలు వేయిస్తా" అన్నా.

"మేం చదువుకోంగా" అంది అక్కయ్య.

"అల్లరి చెయ్యంగా" అంది చెల్లి.

"చదువురాని చవటలు మీరు" అన్నా కోపంగా ఏదీ గతి లేక.

"చవట, గివట అనకు ఒరేయ్" అంది అక్కయ్య.

"ఏం చేస్తావేం?"

"అమ్మా చూడవే వీణ్ణి...తిడుతున్నాడూ..." అని కేకేసింది అక్కయ్య.

"ఏమిట్రా అల్లరి...పెళ్ళిడు పిల్లని తిట్టొచ్చా..." అంటూ వచ్చింది అమ్మ.

"అమ్మా! వీళ్ళనికూడా రేపట్నుంచి బడికి పంపించవే."

"వాళ్ళకెందుకురా చదువు?"

"ఏం నాకేనా చదువు?"

"ఔను...నువ్వు మగాడివి...ఉద్యోగం చెయ్యొద్దూ...వాళ్ళకి ఎందుకు చదువు? చాకలిపద్దు చాతనాతే చాలు."

"అలా కాదే అమ్మా వీళ్ళనికూడా రేపట్నుంచి బడికి పంపించు...ఊఁ...ఊఁ...

# ★ తారతమ్యం ★

బండ వేయిస్తాను వాళ్ళ మేష్టారితో చెప్పి" అన్నాను.

"నీ ఏడుపు అది...నీకు పడిందికదా బండ...మాకెందుకు పడలేదని. మేం బడికి వెళ్ళక్కర్లేదోయ్ వెర్రి తమ్ముడూ!" అంది అక్కయ్య నవ్వుతూ.

"ఔనౌనోయ్" అంది చెల్లి చంకలు చరుచుకుంటూ.

"అమ్మా! చూడవే వీళ్ళనీ.." అన్నాను.

"ఒసేయ్ మీరు ఊరుకోండి పుణ్యం ఉంటుంది" అంటూ అమ్మ వెళ్ళిపోయింది.

రెండు నిమిషాలసేపు మౌనం వహించాను అంతా.

అక్కయ్య తాను అల్లుతున్న బొమ్మని చెల్లికి చూపిస్తూ "ఈ కిష్టుడికి బలే శిక్ష పడింది లేవే...అల్లరి పిల్లలలికి అలాగే శాస్తి జరగాలి" అంది.

నాకు అరికాలిమంట నెత్తికెక్కింది.

"నాన్న రానీయండి.....కంసుణ్ణీ, ఈ రాధల్నీ చంపేస్తాను" అన్నాను.

"కంసు డెవరే అక్కయ్యా!" అంది చెల్లి.

"మామయ్యే"

"రాధ లెవరే?"

"మనమే నే!"

"నా పేరు, నీ పేరు రాధలు కాదుగా" అంది చెల్లి.

"వాడి చదువు అలా వెలిగిపోతోంది" అంది అక్కయ్య.

కోపంతో లేచాను. బండ నెత్తబోయాను. ఆడపిల్ల లిద్దరూ అదృశ్యమయారు.

సోమవారం ఉదయం మామయ్యని ఒప్పించి అమ్మ నాకు శిక్షను సడలించింది. ఆ సాయంకాలమే నేను కాన్వాస్ జోడు కొనుక్కోగా బేడ మిగిలింది. "లంకాదహనం" సినిమాకు వెళ్ళాను. అణా మిగిలితే ఒక సోడా తాగి అర్థణా పకోడీలు తిని ఒక డబ్బుతో ఇంటికి రాత్రి చేరాను.

మా అమ్మ నా రాకకోసం ఎదురు చూస్తోంది. నేనేం కోపగించుకుని అఘాయిత్యం చేస్తానో అని ఆమె బెంగపెట్టుకుంది. నాన్న ఆనాడే శెలవు పెట్టి మమ్మల్ని చూడటానికి వచ్చాడు. నాన్నకు నా విషయమంతా అమ్మ చెప్పినట్లుంది. ఇద్దరూ వీధి అరుగుమీద కూర్చున్నారు.

నాకు చాల ఆకస్మికంగా నాన్న కనుపించడంతోటే "నాన్నా! నాకేం తెచ్చావ్?" అన్నా - చనువుగా.

చాలరోజులు నాన్న నాకు దూరంగా ఉండటంవల్ల నాలో ఈ చనువు అప్రయత్నంగా వచ్చింది.

"కోటయ్య కాజాలు తెచ్చాన్రా" అంటూ నన్ను దగ్గరకు తీసుకున్నాడు నాన్న.

"నాన్నా.....మామయ్య మంచివాడు కాదు..." అని గునుస్తూ అన్నాను.

"అమ్మ చెప్పిందిలే అంతా.....ఔను గాని...అక్కనీ చెల్లినీ నేను లేనప్పుడు కొట్టి తిట్టి అల్లరిపెట్టవచ్చా? తప్పుకదూ!" అన్నాడు నాన్న.

"నిజం నాన్నా!" అన్నాను.

రాతిబండ అఘాయిత్యానికీ, రాళ్ళను కరిగించే ఆప్యాయతకీ తారతమ్యం తెలుసుకున్నాను. ★


కడుపులోని అస్వస్థతకు




ఈనోస్ 'ఫ్రూట్‌సాల్ట్'

తాజా గుణము చిరకాలముండుటకుగాను సీసాలలో అమ్మబడును.

"ఈనో" మరియు "ఫ్రూట్ సాల్ట్" అను మాటలు రిజిస్టర్డు ట్రేడ్ మార్కులు



కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహామచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్లాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.




ఒకనాడు ఆయన్ని, ఆయన పెళ్లాం సంతకెళ్లి ఆవకాయల జాడీలు కొనుక్కు రమ్మంది. ఆయన ఒక కొట్లోకి వెళ్లాడు. అక్కడ జాడీలు తలక్రిందులుగా పేర్చి పెట్టివున్నాయి. ఒకజాడీ పైభాగాన్ని తడిమి "అరె! దీనికి మూతిలేదే" అనుకొనాడు. ఇంకోదాన్ని పైకెత్తి అడుగు తడిమి "చిత్రం! దీనికి అడుగుకూడా లేదు" అనుకొన్నాడు.

—శ్రీ పి. సీతారామయ్య (మద్రాసు)